క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పెదకూరపాడు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని పేర్కొన్నారు. సమస్యలు ఉన్న వారు ఈ కార్యక్రమంలో అర్జీలు అందించాలని కోరారు.

రాహు–కేతువులకు విశేష పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం రాహు–కేతు పూజలకు అనుకూలమైన రోజుగా అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ముందుగా రాహు–కేతువులను ప్రత్యేకంగా అలంకరించారు. దోషాలు ఉన్నవారు ఇక్కడి రాహు–కేతువులను పూజిస్తే సర్వదోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

రేపు జాబ్ మేళా

క్రోసూరు: క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాధికారి ఇ.తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు మూడు కంపెనీలు పాల్గొంటాయని, ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హతను బట్టి వేతనం ఉంటుందని తెలిపారు. అర్హతలు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు చదువుకున్న 18–45 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు హాజరుకావచ్చునన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు సంబంధిత పత్రాలతో నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు బి.అంజిరెడ్డి, 7779858789, రామకృష్ణారెడ్డి 8074393466 నంబర్లను సంప్రదించాలన్నారు. http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అదనపు ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గతంలో ఇళ్లు మంజూరు అయిన వారికి అదనంగా ప్రభుత్వం మరికొంత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రాములు నాయక్ ఆదివారం తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.1లక్ష అదనంగా ఇస్తుందన్నారు. ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎంఏవై 2.0 అర్బన్, గ్రామీణ పథకం ద్వారా కొత్తగా ఇళ్లు కట్టుకునే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 3,813 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు పెంచారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు భార్యాభర్తల బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర పత్రాలతో సచివాలయంలో గానీ, హౌసింగ్ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

నేడు బయ్యవరం తిరునాళ్ల

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామంలో సోమవారం జరగనున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రరావు ఆదివారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో 12 ప్రభలు పెట్టేందుకు ఏర్పాటు చేసుకున్నందున ఎటువంటి గొడవలు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా ప్రభకు ఐదుగురు చొప్పున కమిటీ సభ్యులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలోని పాత రౌడీ షీటర్లను కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సఖ్యతగా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి : మండలంలోని పొందుగల రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు ఆదివారం గుర్తించారు. సుమారు 35 సంవత్సరాల వయసున్న యువకుడు రైలు పట్టాలపై మృతిచెందినట్లుగా గుర్తించి, కేసు నమోదు చేశారు. మృతుడి శరీరంపై లైట్ బిస్కెట్ రంగు ప్యాంట్, లైట్ గ్రీన్ కలర్ టీ షర్ట్, కాళ్లకి నలుపు రంగు చెప్పులు ధరించి ఉన్నాడు. రైలు ఢీకొట్టటంతో తల ఛిద్రమైంది. ఘటనా స్థలాన్ని జీఆర్పీ ఏఎస్ఐ వెంకట్రావ్, కానిస్టేబుల్ రామరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలకు నడికుడి రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఇచ్చట.. సిబ్బంది కావలెను..!

- రాజుపాలెం పీహెచ్‌సీలో పది పోస్టులు ఖాళీ
- కీలకమైన అధికారి జీతం ఇక్కడ పని వేరే చోట
- పని భారంతో సతమతమవుతున్న సిబ్బంది



రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రాజుపాలెం: రాజకీయ పలుకుబడికి తోడు అధికారుల ఉదాసీనతతో ఒక మండల స్థాయి అధికారి పని ఒక చోట చేస్తూ, జీతం మరొక చోట తీసుకుంటున్నాడు. తగిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేయలేక సతమతమవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఆలకించే వారే లేరని సిబ్బంది వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న తంతు ఇది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న కాస్త సిబ్బందికి పనిభారం ఎక్కువ కావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీ పోస్టులు ఇవి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులు వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ అధికారి(సీహెచ్‌వో), స్టాఫ్ నర్సు, పబ్లిక్ హెల్త్ నర్సు(పీహెచ్ఎన్), అటెండర్, ఎఫ్ఎన్‌వో, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్–2 (అనుపాలెం, బలిజేపల్లి), ఆశా కార్యకర్తలు–2 (మొక్కపాడు, రెడ్డిగూడెం). ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఒక్కొక్కరు 12 గంటలు

గత 20 రోజుల క్రితం ఇక్కడ డాక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణకుమార్‌కు పీజీ సీటు రావడంతో బదిలీపై వెళ్లారు. రెండవ డాక్టర్ రవితేజనాయక్ పీహెచ్‌సీలో ఓపీలు చూసి 104 వాహనంలో సర్వీసులు అందజేయాలి. ఉన్న డాక్టర్ 104 వాహనానికి వెళ్లినప్పుడు ఓపీలు సిబ్బందే చూసుకోవాలి. ఇద్దరు డాక్టర్లు ఉండడంతో మండలంలోని కొన్ని గ్రామాలను ఒక డాక్టర్, మరికొన్ని గ్రామాలలో రెండవ డాక్టర్ చూస్తుంటారు. బదిలీపై వెళ్లిన డాక్టర్ 104 వాహనం ద్వారా చూసే గ్రామాలలో సిబ్బందే చూస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు డాక్టర్ లేకపోవడంతో సిబ్బందిని నిలదీస్తున్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులకు గాను ప్రస్తుతం ఇద్దరే ఉండడం వలన ఒక్కొక్కరు 12 గంటలు పని చేయాల్సి వస్తుందని బాధపడుతూ వాపోతున్నారు.

పని మరొక చోట.. జీతం ఇక్కడ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ తరువాత కీలకమైన పోస్టు సీహెచ్‌వో పోస్టు. ఇక్కడ సీహెచ్‌వో(కమ్యూనిటీ హెల్త్ అధికారి)గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు నాలుగేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అతను రాజకీయ పలుకుబడి, అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెబుతూ అక్కడే పనిచేస్తున్నాడు. ఇక్కడ జీతం తీసుకుంటున్న అధికారి అక్కడ పనిచేయడమేంటని ప్రజలు మండిపడుతున్నారు. ఆయన ఇక్కడ చేయాల్సిన పని ఎవరు చేస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. నాలుగు సూపర్‌వైజర్ పోస్టులకు గాను ఇద్దరు 143 జీవో ద్వారా బదిలీపై వెళ్లారు. వారు కూడా ఇక్కడి నుంచే జీతాలు డ్రా చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులను వెనక్కి రప్పించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారిని పంపించాలని అధికారులకు లెటర్ కూడా పెట్టాం. త్వరలో మరొక డాక్టర్ వస్తారు. అప్పటి వరకు ఓపీలకు గానీ, 104 వాహనంలో వైద్య సేవలు గానీ ప్రజలకు అంతరాయం కలగకుండా అందిస్తాం.

– వి.రవితేజనాయక్, వైద్యాధికారి, రాజుపాలెం

సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ప్రదీప్



చిలుకా ప్రదీప్



ఎం.గౌతమి

సత్తెనపల్లి: గ్రామ/వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడిగా చిలుక ప్రదీప్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పూర్తి కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యక్షులుగా గంటా శ్రీనివాసరావు, అబ్దుల్ మున్నాఫ్, జనరల్ సెక్రటరీగా ఎం.గౌతమి, సెక్రటరీగా రత్న పుణ్యవతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బురే సైదా, జాయింట్ సెక్రటరీగా ఎస్.భవాని కుమారి, ట్రెజరర్‌గా రెబ్బవరపు సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేముల అవంతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సీహెచ్ అరుణ, గౌరవ సలహాదారుడిగా గుజ్జర్లపూడి రవిరాజు నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ నేత సాంబయ్య గుండెపోటుతో మృతి



కట్టా సాంబయ్య పార్థివదేహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, నాయకులు



సాంబయ్య (ఫైల్)

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య(68) గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన గత కొంతకాలం క్రితం అనారోగ్యంగా ఉండటంతో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉంది. మండలంలోని గుడిపూడి గ్రామం అయినప్పటికీ కొంత కాలంగా నందిగామలోనే నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరుతున్న సమయంలో 9:15 గంటలకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి ఇంటిలోనే మంచంపై పడి మృతి చెందారు. మృతుడికి భార్య సీతామహాలక్ష్మి, కుమారుడు సతీష్ ఉన్నారు. కుమారుడు సతీష్ హైదరాబాదులోని ప్రముఖ విద్యా సంస్థలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కట్టా సాంబయ్య సత్తెనపల్లిరూరల్ మండల పరిధిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించాడు. గుడిపూడి గ్రామంలో తనదైన శైలిలో రాజకీయాలు నడుపుతూ పేదలకు చేదోడు వాదోడుగా నిలిచేవాడు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. కట్టా సాంబయ్య మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గార్లపాటి ప్రభాకర్, నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కరరెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. సోమవారం కట్టా సాంబయ్య అంత్యక్రియలు గుడిపూడి గ్రామంలో నిర్వహించనున్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు రంగం సిద్ధం

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- 27న ఎన్నికల నిర్వహణ



సివిల్, క్రిమినల్ న్యాయస్థానముల భవన ముఖద్వారం

సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పల్నాడు ముఖద్వారమైన సత్తెనపల్లి కేంద్రంగా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఉన్నాయి. ఈ నాలుగు కోర్టుల పరిధిలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలతో పాటు సివిల్‌కి సంబంధించి తాడికొండ నియోజకవర్గంలోని ఫిరంగిపురం మండలం కూడా ఈ కోర్టుల పరిధిలో ఉంటుంది. మొత్తం ఒక పట్టణం, 10 మండలాల పరిధి విస్తరించి ఉంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే బార్ అసోసియేషన్ ఎన్నికలు న్యాయవాదులంతా సమావేశమై దాదాపు ఏకగ్రీవంగా చేసుకుంటారు. కానీ మునుపెన్నడూ లేని విధంగా ఈసారి బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ప్రధానంగా సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్, న్యాయవాది గంగూరి అజయ్ కుమార్ మధ్య పోటీ నెలకొంది. బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 17న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు నామినేషన్లు స్వీకరిస్తారు. 19న స్క్రూటినీ, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెల్లడి, 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఎన్నికల నిర్వహణ, అదే రోజు 5 గంటలకు కౌంటింగ్ నిర్వహించి గెలుపొందిన వారిని ప్రకటించనున్నారు. దీనిలో భాగంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసే క్రమంలో నిమగ్నమయ్యారు.

పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగంతోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా ప్రజలందరి మనసుల్లో నిలిచారన్నారు. పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు పడాల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, రమావత్ కోటేశ్వరరావునాయక్, నక్కా శ్రీనివాసరావు, అచ్యుత శివప్రసాద్, పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), తుమ్మల వెంకటేశ్వరరావు, వాకుమళ్ళ చెంచిరెడ్డి, సందెపు గాంధీ, ఘోర, యాసారపు బాబు, సిరిగిరి వెంకట్రావు, వల్లేం నరసింహారావు, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ కోసం ప్రాణార్పణ చేసిన మహనీయుడు

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన త్యాగాలను స్మరించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం: ఎంపీడీవో

బెల్లంకొండ: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి త్యాగం, స్ఫూర్తితో అందరం కలిసి పనిచేద్దామని పేర్కొన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం శ్రీరాములు అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఏపీవో కోటమ్మ, ఏఈలు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పెదకూరపాడులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొమ్మాలపాటి, ఆర్యవైశ్యులు

పెదకూరపాడులో...

పెదకూరపాడు: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకై ఆత్మ బలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం పెదకూరపాడులోని పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్తిమళ్ల రమేష్, పొట్టి నాగమల్లేశ్వరరావు, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, డాక్టర్ గుడిపూడి రాజు, పొటికట శ్రీను, షేక్ మస్తాన్ షరీఫ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

యువతకు ఆదర్శనీయుడు పొట్టి శ్రీరాములు


క్రోసూరు: తెలుగుజాతి హక్కుల కోసం, ప్రత్యేక తెలుగు భాషా రాష్ట్రం ఏర్పడాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు యువతకు ఆదర్శనీయుడని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు అన్నారు. ఆదివారం క్రోసూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అటువంటి గొప్ప నేతల అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందన్నారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.బుల్లిబాబు, పాఠశాల ప్రిన్స్‌పాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో.. క్రోసూరు మండల ఆర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జాతీయ నాయకుల విగ్రహాల సెంటర్లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రెడ్డి పేరంటాలమ్మ ఆలయ ప్రతిష్ట



శాంతి హోమాల్లో భక్తులు



దీపాలంకరణలో ఆలయం

నాదెండ్ల: సాతులూరులో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై మహాలింగ దేవత, ఆభరణ, శ్రీచక్రనాభవర్ణ పేరంటాలమ్మ తల్లి ఆవరణ, దేవతల వాహనాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ముత్తైదువులు అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. 11 గంటలకు విగ్రహ మూర్తులకు ఔషధ స్నపన, నవనీత క్షీరాధివాసములు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను నెమ్మికంటి నరసయ్య ఆచార్య స్వామిజీ బృందం, వేద పండితులు హత్తులూరి బాలశంకరశాస్త్రి, తియ్యబండి కళ్యాణ కుమారాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కొండపర్తి పూర్ణాచార్యులు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.41 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన కర్తవ్యం

- పెదకూరపాడులో సీపీఐ శత వార్షికోత్సవాల్లో ముప్పాళ్ల
- అమరవీరుల స్థూపాల వద్ద నివాళి



మాట్లాడుతున్న ముపాళ్ల నాగేశ్వరరావు

పెదకూరపాడు: సామ్యవాద వ్యవస్థ నిర్మాణానికి అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన కర్తవ్యం అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముపాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పెదకూరపాడులో సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా అమరజీవుల సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ దర్శి లక్ష్మయ్య, కామ్రేడ్ అంబటి హనుమంతురావు, కామ్రేడ్ తురక చిన్నప్ప పంతులు స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాల పురిటి గడ్డ పెదకూరపాడు అని అన్నారు. పెదకూరపాడు నుంచి కామ్రేడ్లు దర్శి లక్ష్మయ్య, చిన్నప్ప, హనుమంతురావు, కొమ్మాలపాటి అప్పారావు, దర్శి వెంకట్రావు, హుస్సేన్ ఖాన్, పానకాలరావు, వెంకట సరసయ్య, వెంకట అప్పారావు, ప్రభాకరరావులు సమసమాజం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు గన్ని, బైరవపట్నం రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి గునగొటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు చలువ పదార్థాల పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్, మహాత్మాగాంధీ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీపాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పదార్థాలు, పానీయాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వెల్లంపల్లి కేశవరావు, కోడూరి రాము, చేగు వెంకటేశ్వరరావు, మండవ వెంకటరత్నం, రెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు గ్రామంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బీరవల్లి సత్యనారాయణరెడ్డి, మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సాత్వికాహారంతో ఆరోగ్యం మెరుగు



నరసరావుపేట ఈస్ట్: సాత్వి కాహారంతో ఆరోగ్యం మెరుగవుతుందని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం (మంగళగిరి) వ్యవస్థాపకులు డాక్టర్ వేంకటేశ్వర యోగి తెలిపారు. నరసరావుపేట (రూరల్) శాఖ ఆధ్వర్యంలో రావిపాడురోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 4వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆనంద మహోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులను ఉద్దేశించి టెలికాన్ఫరెన్స్‌లో వేంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడారు. యోగా గురువులు కూనిశెట్టి వెంకట జనార్దన్, కాపుగంటి శివప్రసాద్, కనమర్లపూడి శారద తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ముస్లిం సంక్షేమ కమిటీ



నరసరావుపేట: రాబోయే రోజుల్లో పార్టీలకు అతీతంగా నూతన ముస్లిం సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని పలువురు ముస్లిం నాయకులు నిర్ణయించారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో అన్ని పార్టీలలోని ముస్లిం పెద్దలు సమావేశమయ్యారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, షేక్ గఫార్, నాయకులు బొందాల బాషా, షేక్ గౌస్‌పీరా, షేక్ అయూబ్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ ఆడ్రుఫ్, హాజీ కరీముల్లా, ఎస్‌జేఎస్ బాజీ, రహమతుల్లా, నర్సింగ్ వలి, అజీజ్, మున్నాన్ షరీఫ్ పాల్గొన్నారు.